క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

అరసవల్లి: శ్రీకాకుళం రూరల్ మండలం కనుగులవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మోపసుబందరు, సాధుపేట, జాలరిపేట, పుక్కల్లపేట, పెద్ద గణగల్లవానిపేట, చిన్నగణగళ్ల వానిపేట, నర్సయ్యపేట, ఖాజీపేట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈఓకు చెక్ అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నంకు చెందిన దంతులూరి సూర్యనారాయణ రాజు కుటుంబసమేతంగా వచ్చి రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ మేరకు విరాళ చెక్కును ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందించారు. రూ.లక్ష, అంతకుమించిన విరాళాలు ఇచ్చిన దాతలకు డోనర్ పాసులు అందజేస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

24న మండల సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటన్నబాబు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం పది గంటలకు ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

నేత్రపర్వంగా శ్రీవారికి క్షీరాభిషేకం



స్వామివారికి క్షీరాభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పీఎన్‌కాలనీలో ఉన్న నారాయణ తిరుమల వేంకటేశ్వర ఆలయంలో కల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి నిజరూపాన్ని కనులారా వీక్షించి తన్మయత్వం పొందారు. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది.

ప్రత్యేక అలంకరణలో త్రిపురసుందరీదేవి



బాలా త్రిపురసందరిదేవి

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నదీ తీరాన ఉన్న బాల త్రిపుర కాలభైవర పీఠం దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.

సంతోషిమాతకు పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు పాలు, పసుపు నీళ్లతో అభిషేకాలు చేశారు. అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారిని పూలతో అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఎవరి లెక్కలు వారివి..!

- తలమునకలైన ప్రధాన పార్టీలు
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో అత్యధికంగా 83.28 పోలింగ్



పాతర్లపల్లిలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న ఓటర్లు(ఫైల్)

రణస్థలం: ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. గెలుపు విషయంలో వైఎస్సార్‌సీపీ, కూటమి మద్దతు పార్టీలు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,44,760 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా 83.28 శాతం ఓట్లు పోలయ్యాయి. 2019లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో 18,711 ఓట్లు మెజారిటీతో వైఎస్సార్‌సీపీ తరఫున గొర్లె కిరణ్‌కుమార్ గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అండగా నిలిచాయి. దీంతో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా సైలెంట్ ఓటింగ్ సాగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి ఆ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తాయని నాయకులు, అభిమానులు ప్రగాఢ విశ్వాసంతో ఉన్నారు. మహిళలకు ఎంతో దగ్గరైన అమ్మఒడి, అసరా, చేయూత వంటి పథకాలు ఆకర్షించగా.. రైతన్నలకు ఇంటి వద్దకే విత్తనాలు, ఎరువులు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలతో పాటు పంట నష్టం, రైతు భరోసా వంటి పథకాలు వెన్నుదన్నుగా నిలబడ్డాయి. అవ్వాతాతాలకు ఇంటి వద్దకే పింఛన్, ఇలా అన్నీ వర్గాలకు మేలు చేసిన జగన్ మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బాబు హామీలను నమ్మని జనం!

చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలైన మహిళలకు ఉచిత బస్సు, పింఛన్ల పెంపు, ఇంట్లో అందరికీ అమ్మఒడి, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రజలు నమ్మినట్టు లేదు.

బీజేపీకి టీడీపీ వెన్నుపోటు

కూటమిలో భాగంగా బీజేపీకి ఎచ్చెర్ల టిక్కెట్‌ను కేటాయించారు. దీంతో టీడీపీ, జనసేన శ్రేణులు కూటమి అభ్యర్థికి పూర్తి సహకారం అందించినట్లు భావిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించలేదు. టీడీపీ శ్రేణులు అధిక ఓట్లు ఉన్న కాపు సామాజిక వర్గాన్ని పక్కన పెట్టి చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి బీజేపీ టిక్కెట్‌ను కేటాయించడంతో.. ఎవరూ పూర్తిస్థాయిలో పని చేయకుండా బీజేపీకి వెన్నుపోటు పొడిచినట్లు ప్రచారం జరుగుతుంది.

మండలాల వారీగా ఓటింగ్ తీరు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు
రణస్థలం	65,055	57,271	29,249	28,021
లావేరు	54,564	45,542	23,098	22,443
జి. సిగడాం	46,703	37,649	18,927	18,722
ఎచ్చెర్ల	78,438	63,369	31,407	31,961
మొత్తం	2,44,760	2,038,31	1,02,681	1,01,147

నడవడిక మార్చుకోండి



మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్ : తెలిసో తెలియక చేసిన తప్పుల కారణంగా సమాజంలో రౌడీషీటర్లుగా ముద్రపడే మీలాంటి వారంతా నడవడిక మార్చుకుంటే రౌడాషీట్లు ఎత్తివేస్తామని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఎస్పీ రాధిక ఆదేశాలతో శుక్రవారం రాత్రి స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లతో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉన్న మాదిరిగానే మిగతా సమయంలోనూ ప్రశాంతంగా కుటుంబంతో గడపాలన్నారు. కొట్లాటకు, దొమ్మీలకు వెళ్లి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పీడీ యాక్టులు నమోదు చేసి జిల్లా బహిష్కరణకు గురి చేస్తామన్నారు. సీఐతో పాటు ఎస్ఐ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల సరఫరా

ఎచ్చెర్ల క్యాంపస్: రైతులకు 50 శాతం రాయితీ పై పచ్చిరొట్ట విత్తనాలను అందజేయనున్నట్లు వ్యవసాయ అధికారి సురేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జీలుగు, కట్టెజనుము, పిల్లిపెసర విత్తనాలను సరఫరా చేయనున్నట్లు చెప్పారు. కావల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పది కిలోల జీలుగు రూ.440, పది కిలోల కట్టె జనుము రూ. 440, ఎనిమిది కిలోల పిల్లి పెసర రూ. 536గా చెప్పారు.

రాయితీపై కట్టె జనుము విత్తనాలు

గార: మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు ముందస్తుగా వేసే కట్టె జనుము, జీలుగు విత్తనాలు 50 శాతం రాయితీపై అన్ని రైతు భరోసా కేంద్రాల్లో లభ్యమవుతున్నాయని గార మండల వ్యవసాయాధికారి దుంపల పద్మావతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కట్టె జనుము 30 క్వింటాళ్లు, జీలుగు 70 క్వింటాళ్లు విత్తనాలు మంజూరయ్యాయని, రైతులు ఆర్బీకేల వద్దకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అనురాగ నిలయంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్టాఫ్‌నర్సుగా సేవలు అందిస్తూ సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యురాలిగా నిరంతర సేవలు అందిస్తున్న గిరజాల మహాలక్ష్మీ సేవలు ప్రశంసనీయమని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతాకళ్యాణ్ అనురాగ నిలయంలో మహాలక్ష్మీ భర్త ఆర్.భాస్కర్ జన్మదినం పురస్కరించుకుని వృద్ధులకు, పిల్లలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.డేవిడ్, ట్రస్టు ప్రతినిధి పాలకొండ ప్రశాంత్, ఉర్లాం శివతేజ, కొంతం సునీల్, ఉమాశంకర్, అవినాష్, చరణ్, జిల్ సాయి, సుప్రజ రౌత్, బెహరా ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకన్నబాబు

జి.సిగడాం: వేసవి కారణంగా గ్రామాల్లో మంచినీటి సమస్య లేకుండా చర్యతీసుకోవాలని ఎంపీడీవో వెంకన్నబాబు సంబంధిత సిబ్బందికి సూచించారు. జి.సిగడాం సచివాలయం సిబ్బందితో స్థానిక కార్యాలయంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైపులైన్లు, బోర్లు సక్రమంగా పనిచేసేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించకుండా ప్రజలు సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి తులసీప్రసాద్ సాహు, వీఆర్వో భూపతి నర్సింగరావు, పొగిరి రాము ఉన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు చిట్టి జానకమ్మకు పూండికి చెందిన యువతరం సేవా సమితి రూ.15 వేలు ఆర్థిక సహాయం చేసి ఆదుకుంది. శుక్రవారం ఉద్దానం రామకృష్ణాపురం వెళ్లిన సేవా సమితి ప్రతినిధులు జానకమ్మ పేదరికంతో మగ్గుతుండడం చూసి చలించిపోయారు. భర్త చనిపోవడం, బ్రెయిన్ క్యాన్సర్, కిడ్నీ వ్యాధి బారిన పడిన ఆమెకు నెలకు దాదాపు రూ.8వేలు వరకు మందుల కోసం ఖర్చు అవుతున్నాయి. విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి ఆదుకుంది. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత మురళీ, ప్రతినిధులు జి.సునీల్, బత్తిని విఘ్నేష్, జి.వెంకటరమణ, గాడి అఖిల్, బి.లక్ష్మణ్, మణి, వెంకటేష్, మాధవరావు, భాస్కర్, ప్రమీల, దీపిక పాల్గొన్నారు.

మోహనరావుకు పురస్కారం

నందిగాం: తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు వెలుగు సాహితీ సాంస్కృతిక ఉత్సవాలు–2024లో భాగంగా జాతీయ పురస్కారానికి నందిగాం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన జీరు మోహనరావు ఎంపికయ్యారు. ఈయన పాతికేళ్లుగా రంగస్థల, పౌరాణిక, భజన కళారంగంలో అందించిన సేవలను గుర్తించి తెలుగు వెలుగు జ్ఞానబుద్ధ పూర్ణ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19న ప్రకాశం జిల్లాలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకుంటారు. మోహనరావును కళాకారులు, భజన బృంద సభ్యులు అభినందించారు.

రామానుజుల కృషి ప్రశంసనీయం



పద్మనాభాచార్యులును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మానవుల ఉన్నతికి భగవద్రామానుజాచార్యులు విశేష కృషి చేశారని ప్రముఖ వక్త భాష్యం పద్మనాభాచార్యులు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో మహానుభావుల జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రసంగించారు. విశిష్టాద్వైత మూలపురుషుడైన రామానుజాచార్యులు ఆధ్యాత్మికంగా, సాంఘికంగా విశేష సేవలు అందించారని కొనియాడారు. మణికొండ రామారావు, ఎస్.నారాయణమూర్తి, పప్పు పతంజలి శాస్త్రి, పి.అప్పలకొండ, ఎం.శ్రీనివాసరావు, బాబూరావు, ఈశ్వరరావు, సంగమేశ్వరరావు పాల్గొన్నారు.

సామూహిక లలితా సహస్రనామ పారాయణ



సామూహిక లలితా సహస్రనామ పారాయణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఎచ్చెర్ల వీధిలో సామూహిక లలితా సహస్రనామ పారాయణాలు శుక్రవారం పెద్ద ఎత్తున జరిగాయి. ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాల్లో భాగంగా మొండేటి వీధిలోని లలితాదేవి అమ్మవారి ఆలయం నుంచి షిర్డీ సాయి సేవా సంఘం, దివ్యటెక్స్ స్టైల్స్ ఆధ్వర్యంలో గుజరాతిపేట రాజరాజేశ్వరీ లలీతా మహాత్రిపుర సుందరి పీఠం పర్యవేక్షణలో శంకరాచార్యుల చిత్రపటంతో ఊరేగింపు జరిగింది. వెయ్యి మంది మహిళలతో సామూహిక పారాయణాలు జరిగాయి. కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ, వశిష్ట కార్తికేయ శర్మ పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న బాలభాస్కరశర్మ

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని శ్రీచక్ర మేరువుల దేవీ ఆశ్రమంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. మహామేరువులకు పీఠాధిపతి బాలభాస్కరశర్మ నేతృత్వంలో క్షీరాభిషేకాలు చేశారు. సంప్రదాయ దుస్తుల్లో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు 10 మంది అర్హత

శ్రీకాకుళం న్యూకాలనీ: తమ పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థినులు మహాత్మా జ్యోతిబాపూలే జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు అర్హత పొందినట్టు శ్రీకాకుళం హయాతీనగరం ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఎంపికైన వారిలో ఎం.పద్మపూజిత, డి.భార్గవి, వై.జాహ్నవి, ఎల్.మనీషా, పి.చందన, పి.అపర్ణ, పి.సాయిలక్ష్మి (నెల్లిమర్ల జూనియర్ కళాశాల),జి.రంజిత (తానాం), పి.అనుశ్రీ (గుడిబండ), ఎస్.తేజేశ్వణి (ఆమదాలవలస) ఉన్నారు. వీరి ఎంపిక పట్ల ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పాడిని కాపాడుకుందాం ఇలా..

- వేసవిలో పాడిపశువుల సంరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు
- పశువైద్యాధికారి రమణ



వి.రమణ, పశువైద్యాధికారి



పాకలో కట్టిన పశువులు

ఎచ్చెర్ల: పాడిపై ఆధారపడిన రైతులకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోంది. గేదెలు, ఆవులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినా తక్షణమే వైద్య సాయం అవసరమైతే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే క్షణాల్లో పశువైద్యులు అంబులెన్స్ ద్వారా అక్కడికి చేరుకుని పశువుల ప్రాణా లు కాపాడుతున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత పెరుగుతున్న తరుణంలో పాడి రైతులు జాగ్రత్తలు పాటిస్తే పశువులను కాపాడుకోవచ్చని ఎచ్చెర్ల మండల పశువైద్యాధికారి డాక్టర్ వి.రమణ సూచించా రు. చలువ పందిళ్ల కింద పశువులను ఉంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయన్నారు. పాడి రైతులకు ఆయన అందించిన సూచనలు ఇలా..

- పశువులకు కొట్టం ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కొట్టంలోకి గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాలి. పరిశుభ్రమైన చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి. పచ్చని, ఎండుగడ్డి సమృద్ధిగా అందించాలి.
- సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించి అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులకు కారణమయ్యే గోమార్లు, దోమలు, ఈగలను నిర్మూలించాలి. గేదెల పాకలు చల్లగా ఉండేలా జాగ్రత్త పడ్డాలి. పశువుల పాక పైకప్పును గడ్డి తోకప్పి నీళ్ల చల్లుతూ ఉండాలి.
- వీలైనంత వరకూ పాక పరిసరాల్లో చల్లటి నీడనిచ్చే కానుగ, బాదం, వేపచెట్లు పెంచుకోవాలి. రోజుకు రెండు మూడు సార్లు పశువులను చల్లటి నీటితో కడగాలి. వేసవిలో ఉదయం పది గంటలోపు సాయంత్రం ఐదు గంటలపైన మాత్రమే మేత కోసం పశువులను బయటకు తోలాలి. ఎండ ఉన్న సమయంలో మేతకు బయటకు తోలకూడదు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చమటలు ఎక్కువగా బయటకు రావటం, దాహం అధికంగా పెరగడం, మేత సరిగా మేయకపోవడం, శ్వాస కష్టంగా ఉండటం, ఎదకు సరిగా రాకపోవడం, గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయి.

చికిత్స: వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. చల్లటి ప్రదేశాల్లో ఉంచి తేలికగా జీర్ణం అయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్స్ట్రోజ్ సైలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి విటమిన్ ఏ, డీ సూదిమందులను విటమిన్ సీ, బీ కాంప్లెక్స్ సూది మందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి.

పచ్చిమేతే రక్షణ

వేసవిలో పశువులకు పచ్చిమేత అందించాలి. పచ్చిగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్సర్) వంటివి వాడాలి. పచ్చగడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45-55 శాతం వరకూ తేమ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంటకుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.

నియోజకవర్గంలో పశువుల వివరాలు..

పశుసంవర్ధకశాఖ అధికారుల లెక్కల ప్రకారం ఎచ్చెర్ల నియోజకవర్గంలో పశువుల వివరాలు ఇలా ఉన్నాయి..

ఎచ్చెర్ల మండలంలో ఆవులు 16,800, గేదెలు 120, గొర్రెలు 12,940, మేకలు 3,942, జి.సిగడాం మండలంలో ఆవులు 12,920, గేదెలు 420, గొర్రెలు 18,420, మేకలు 2,940, లావేరు మండలంలో ఆవులు 12,340, గేదెలు 392, గొర్రెలు 34,200, మేకలు 6000, రణస్థలం మండలంలో ఆవులు 12,987, గేదెలు 482, గొర్రెలు 5,2340, మేకలు 4,500 ఉన్నాయి.

రోగులకు వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ యశ్వంత్

జి.సిగడాం: వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్ సూచించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు శుక్రవారం ప్రత్యేక వైద్య తనిఖీలు చేపట్టారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.

మంత్రి ధర్మానను కలిసిన దువ్వాడ



టెక్కలి: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టెక్కలి నియోజకవర్గంలో పోలింగ్ సరళిని దువ్వాడ వివరించారు. టెక్కలి నియోజకవర్గంలో భారీగా విజయం సాధిస్తామని పేర్కొన్నారు. ఈయనతో పాటు పి.చంటి, బి.రాజు ఉన్నారు.